సాక్షి
నిజామాబాద్

గురువారం । 4 । జూలై । 2024



'డైట్' అక్రమాలపై విచారణ
డైట్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకుడిపై ఆరోపణల నేపథ్యంలో విద్యాశాఖ కమిషనర్ విచారణకు ఆదేశాలు జారీ చేశారు.
- 8లో ▸



అవగాహన అవసరం
వినియోగదారులు ప్రతి అంశంపై కచ్చితమైన అవగాహన కలిగి ఉండాలని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తాన్యానాయక్ అన్నారు.
- 8లో ▸



వాతావరణం
ఆకాశం మేఘావృతం అవుతుంది. ఈదురు గాలులు వీస్తాయి. అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 3,762 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి 479 క్యూసెక్కులు తాగు నీటి అవసరాలకు, ఆవిరి రూపంలో పోతున్నాయి. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1060.60(11.12టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

హాస్టళ్లను సద్వినియోగం చేసుకోవాలి



ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు వసతి గృహాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదువుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి శశికళ సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని బాలికల వసతి గృహాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. అనంతరం విద్యార్థినులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. హాస్టల్ వార్డెన్ ఫర్జానా పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



ధర్పల్లి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. ధర్పల్లిలోని జెడ్పీహెచ్ఎస్, కేజీబీవీ పాఠశాలలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. పాఠశాల రిజిస్టర్లను, వంటగదులను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలని సిబ్బందికి సూచించారు.



హరిత మార్గం.. ఆహ్లాద భరితం

రోడ్డుపై పందిరి వేసినట్లు పచ్చదనంతో కళకళలాడుతున్న చెట్లు ఆ మార్గంలో వెళ్లేవారికి ఆహ్లాదం పంచుతున్నాయి. నందిపేట నుంచి శాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డులో చెట్లు ఏపుగా పెరిగాయి. ఎర్రటి పూలతో ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

జిల్లాలో ఫారెస్ట్ స్టేషన్లు!

- ఐదు చోట్ల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి నివేదన
- అటవీ అధికారులు, సిబ్బందిపై వరుస దాడుల నేపథ్యంలో ప్రతిపాదనలు
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వాన్ని కోరిన అటవీశాఖ
- అడవుల సంరక్షణతో పాటు అటవీ చట్టాలు పక్కాగా అమలు చేయొచ్చంటున్న అధికారులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అడవుల సంరక్షణ కోసం కృషి చేస్తూనే అటవీ చట్టాలను సైతం పకడ్బందీగా అమలు చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్న నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు దాడులను ఎదుర్కోవాల్సి వస్తోంది. అటవీ స్మగ్లర్ల బెడద గతంతో పోలిస్తే ప్రస్తుతం అంతగా లేనప్పటికీ, పోడు భూముల అంశం పెద్ద సమస్యగా మారింది. ఈ పోడు వ్యవహారాల నేపథ్యంలో అటవీ భూముల సంరక్షణ అనేది సమస్యగా మారిందని అటవీ అధికారులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు అనేక చోట్ల అటవీ అధికారులు, సిబ్బందిపై దాడులు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో కొందరు అధికారులు తీవ్రంగా గాయపడగా, మరికొందరు అధికారులు పోడుదారుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. కొన్ని నెలల క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలో పోడుదారుల దాడిలో అటవీ క్షేత్రాధికారి ప్రాణాలు కోల్పోయారు. అదేవిధంగా కొన్నేళ్ల క్రితం ఆసిఫాబాద్ జిల్లాలోనూ పోడుదారుల దాడిలో అటవీ అధికారిణి తీవ్రంగా గాయాలపాలైంది. తాజాగా నిజామాబాద్ జిల్లాలోని మోపాల్ మండలం కాల్పోల్ వద్ద జూన్ 14న పోడుదారులు అటవీ సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. దీనిని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ సీరియస్‌గా తీసుకున్నారు. హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. ఇందులో భాగంగా పోడు భూముల అంశంపై కీలక చర్చ జరిగింది. ముఖ్యంగా గత ఏడాది బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పోడు భూముల పట్టాలకు సంబంధించి ప్రధానంగా చర్చ నడిచింది. కేసీఆర్ ప్రభుత్వం అనర్హులకూ పట్టాలు ఇచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందని మంత్రి సురేఖ ప్రస్తావించారు. ఇలా ఇచ్చిన పట్టాలకు సంబంధించి పూర్తి స్థాయి నివేదిక అందజేయాలని సురేఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. గత ఏడాది ఇచ్చిన పట్టాలకు సంబంధించి పలువురు అనర్హులు ఉన్నట్లు సమావేశంలో చర్చ జరగడం గమనార్హం. ఇలా ఇచ్చిన వాటిలో 2022లో పోడు కొట్టిన భూములకు సైతం పట్టాలు పంపిణీ చేసినట్లు కొందరు చెప్పినట్లు తెలిసింది. తాజాగా చోటుచేసుకున్న కాల్పోల్ ఘటన నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే సమీక్షకు ఉపక్రమించింది. ఈ క్రమంలో మంత్రి సురేఖ సమీక్షతో కదలిక వచ్చింది. ఇదిలా ఉండగా గతంలోనూ కాల్పోల్ ఘటన మాదిరిగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అటవీ అధికారులు దాడులు ఎదుర్కొన్నారు. విధులకు వెళ్లేందుకు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో 'ఫారెస్ట్ స్టేషన్లు' ఏర్పాటు చేయాలని అటవీ అధికారులు కోరుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి ఇటీవల ప్రతిపాదనలు సైతం పంపారు.

■ జిల్లాలో సిరికొండ, కమ్మర్‌పల్లి, ఇందల్వాయి, నిజామాబాద్ దక్షిణ, వర్ని, నిజామాబాద్ ఉత్తర, ఆర్మూర్ అటవీ రేంజ్‌లు ఉన్నాయి. అటవీ విస్తీర్ణం 86,871.45 హెక్టార్ల మేర ఉంది. అయితే పోలీసు స్టేషన్ల మాదిరిగా జిల్లాలోని కమ్మర్‌పల్లి, సిరికొండ, ఇందల్వాయి, నిజామాబాద్ దక్షిణ, వర్ని రేంజ్‌ల పరిధిలో ఫారెస్ట్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి అటవీ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ స్టేషన్లు ఏర్పాటైతే అటవీ చట్టాలను ఉల్లంఘించిన వారిని విచారించేందుకు, అదేవిధంగా పట్టుబడిన వారిని అదుపులోకి తీసుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. ఫారెస్ట్ స్టేషన్లలో అటవీ సిబ్బందితో పాటు ఆర్మీ సిబ్బందిని సైతం నియమించాలని ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనల్లో పేర్కొన్నారు.

సీజనొస్తున్నా.. సిద్ధం కాలే!



గేట్లకు మరమ్మతులు చేస్తున్న వర్కర్లు

- పూర్తి కాని వరదగేట్ల మరమ్మతులు
- అసంపూర్తిగానే ఫ్లడ్ కంట్రోల్ రూం నిర్మాణ పనులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరదలు వచ్చే సీజన్ వచ్చినా వరద గేట్ల మరమ్మతులు, ఫ్లడ్ కంట్రోల్ రూం పనులు ఇంకా పూర్తి కాలేదు. ప్రాజెక్ట్ నుంచి మిగులు జలాలను గోదావరిలోకి వదలడానికి 42 వరద గేట్లను నిర్మించారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో 2021లో గేట్లు ఎత్తితే మొరాయించాయి. కొన్ని గేట్లు పనికి రాకుండా పోయాయి. దీంతో 2022లో అప్పటి ప్రభుత్వం గేట్ల మరమ్మతుల కోసం రూ.17.5 కోట్ల నిధులను మంజూరు చేసింది. 2022 నుంచి పనులు సాగుతూనే ఉన్నాయి. అయినా ఇప్పటి వరకు 30 గేట్ల మరమ్మతులు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 12 గేట్ల మరమ్మతులు అసంపూర్తిగా ఉన్నాయి. ఎగువ నుంచి వరదలు వచ్చి ప్రాజెక్ట్ నిండితే మరమ్మతు పనులు చేపట్టే అవకాశం లేదు. అలాగే ప్రాజెక్టు నుంచి నదిలోకి నీరు వదలాల్సి వస్తే మరమ్మతులు పూర్తి చేసిన 30 గేట్లు మాత్రమే పని చేస్తాయి. దీంతో డ్యాం నీటి ఒత్తిడికి గురయ్యే ప్రమాదం లేకపోలేదు. పనులు వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ప్రాజెక్ట్ నుంచి ఉచితంగా కరెంట్ సరఫరా చేస్తున్నారు. కాంట్రాక్టర్ జనరేటర్ వినియోగిస్తూ పనులు చేపట్టాలని నిబంధనలు తెలుపుతున్నాయి. అయినా రెండేళ్లయిన గేట్ల మరమ్మతులు పూర్తి కాలేదు.

చర్యలు శూన్యం

ప్రాజెక్ట్ ఆనకట్టపై ఫ్లడ్ కంట్రోల్ రూం నిర్మాణం కోసం రెండేళ్ల క్రితం ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసింది. పనులు ఇంకా పూర్తి కాలేదు. ఏడాది నుంచి పనులు సాగకున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రాజెక్ట్ వద్ద పాత ఫ్లడ్ కంట్రోల్ రూం ఉంది. కానీ స్కాడా విధానం రావడంతో సీసీటీవీలు, కంప్యూటర్ సామగ్రి ఎక్కువ అయింది. అధికారులు, సిబ్బంది బయటనే ఉండాల్సి వస్తుంది. దీంతో మరో గది నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు.

ఎలాంటి ఇబ్బంది ఉండదు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద 30 వరద గేట్లకు మరమ్మతులు పూర్తయ్యాయి. వరదలు వస్తే గోదావరిలోకి నీటిని వదలడానికి ఎలాంటి ఇబ్బంది లేదు. మిగతా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఫ్లడ్ కంట్రోల్ రూం పనులు కూడా ప్రారంభించేలా చూస్తాం. - చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

అథ్లెటిక్స్ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులు

నిజామాబాద్ నాగారం: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నాగారంలోని రాజారాం స్టేడియంలో అండర్- 8, 10, 12 బాలబాలికలకు ఎంపికలు నిర్వహించారు. 50 మీటర్లు, 100 మీటర్లు, 300 మీటర్లు, 400 మీటర్లు, 600 మీటర్లు స్టాండింగ్ బ్రాడ్ జంప్, లాంగ్ జంప్ విభాగాల్లో ఎంపికలు జరిగాయి. ఎంపికైన క్రీడాకారులు జూలై 7న రంగారెడ్డి జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటారని ప్రధాన కార్యదర్శి రాజాగౌడ్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఎస్‌బీఐ లైఫ్ డివిజనల్ మేనేజర్ అభినందన్ జాదవ్ హాజరై మాట్లాడారు. 40 పాఠశాలలు పాల్గొనగా అత్యధిక పతకాలు సాధించిన మూడు పాఠశాలలకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల మొదటి స్థానం, కిసాన్‌నగర్‌లోని సెయింట్ ఎలిజబెత్ హైస్కూల్ రెండో స్థానం, స్టార్ వరల్డ్ పాఠశాల మూడో స్థానం సాధించాయి. ఈ కార్యక్రమంలో బాగారెడ్డి, పీడీలు సంజీవ్, దేవసుకన్య, కపిల్, పీఈటీలు శ్రీకాంత్, రంజిత్, సాయినాథ్, సాయిలు, రెహాన్, ఉమా, అన్నపూర్ణ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

- ట్రాన్స్‌ఫర్స్, పోస్టింగులపై నిషేధం ఎత్తేసిన ప్రభుత్వం
- జిల్లాలో 16వేల మంది ఉద్యోగులు



సుభాష్‌నగర్: ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఆరేళ్లుగా బదిలీలు, పోస్టింగులపై ఉన్న నిషేధాన్ని ఎత్తేస్తూ ఉత్తర్వులిచ్చింది. ట్రాన్స్‌ఫర్స్‌కు సంబంధించి స్పష్టమైన విధి విధానాలను రూపొందించింది. 2018 తర్వాత గత ప్రభుత్వం బదిలీలు, పోస్టింగులు చేపట్టలేదు. దీంతో చాలామంది ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. కేవలం డిప్యుటేషన్లతోనే గత ప్రభుత్వం కాలం వెళ్లదీసింది. తాజాగా బదిలీలు, పోస్టింగులపై ప్రభుత్వం నిషేధం ఎత్తేయడంతో ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఉపాధ్యాయులు మినహా గెజిటెడ్, నాన్ గెజిటెడ్, క్లాస్-4 ఉద్యోగులు సుమారు 16వేల మంది ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో బదిలీలు చేపట్టింది. ప్రతి రెండేళ్లకొకసారి బదిలీలు చేపట్టాలి. కానీ ఆరేళ్లుగా నిషేధం విధించడంతో చాలామంది ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులతో అటెండర్ స్థాయి నుంచి జిల్లా అధికారుల వరకు బదిలీ కానున్నారు.

వైద్యారోగ్యశాఖలో..

నిజామాబాద్ నాగారం: జిల్లా వైద్యారోగ్య శాఖలో బదిలీలు చేపట్టనున్నారు. నాలుగేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న వారిని ట్రాన్స్‌ఫర్ చేయనున్నారు. 40 శాతం వరకు బదిలీలు జరగనున్నాయని అధికారులు చెబుతున్నారు. జూనియర్, అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్ కిందిస్థాయి పోస్టులన్నీ జిల్లాస్థాయిలో బదిలీ కానున్నాయి. సీనియర్ అసిస్టెంట్ నుంచి జోనల్ క్యాడర్ కావడంతో ఇతర జోన్‌లకు ట్రాన్స్‌ఫర్ అవుతారు.

నాలుగేళ్లు నిండితే..

నాలుగేళ్లు పూర్తి చేసుకున్న (జూన్ 30, 2024 నాటికి) వారిలో 40శాతం ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయడం, ఉద్యోగ విరమణకు ఏడాది గడువు ఉంటే వారికి ఆప్షన్ ఇచ్చిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత జిల్లా అధికార యంత్రాంగం హెచ్‌వోడీల ద్వారా ఆయా శాఖల్లో ఖాళీలను గుర్తించి నివేదిస్తారు. బదిలీల కోసం దరఖాస్తులు స్వీకరించిన తర్వాత కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. జూలై 21లోపు బదిలీ, పోస్టింగుల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆ తర్వాత మళ్లీ నిషేధం అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది.

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

సాధారణ బదిలీలు, పోస్టింగులపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. బదిలీల్లో యూనియన్ ప్రతినిధులకు వెసులుబాటు కల్పించింది. బదిలీలు ఒత్తిళ్లు లేకుండా పారదర్శకంగా చేపట్టాలి. మెడికల్ గ్రౌండ్ ఉన్న వారికి ఇష్టాన్ని బట్టి మినహాయింపు ఇవ్వాలి.
- అలుక కిషన్, ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్

వాయిదా డబ్బులు జేబులోకి!

- చేతివాటం ప్రదర్శిస్తున్న ఐకేపీ సిబ్బంది
- పక్కదారి పడుతున్న బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు
- రికవరీకి సహకరించని ఐకేపీ ఉద్యోగులు



డొంకేశ్వర్(ఆర్మూర్): స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల ఈఎంఐలు పక్కదారి పడుతున్నాయి. ఎస్‌హెచ్‌జీ మహిళలు తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించే క్రమంలో ఐకేపీ సిబ్బంది చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. వాయిదా డబ్బులను నమ్మి ఇస్తే వాటిని కట్టకుండా సీసీలు, వీవోఏలు తమ జేబులో వేసుకుంటున్నారు. బ్యాంకులకు చేరాల్సిన లక్షల సొమ్మును గుట్టుగా కాజేయడంతో బాధిత ఎస్‌హెచ్‌జీ సంఘాలకు బకాయిలు (ఎన్‌పీఏ) పెరిగిపోతున్నాయి. గడిచిన నాలుగేళ్లలో ఇలాంటి సంఘటనలు చాల వరకు వెలుగుచూశాయి. అయినప్పటికీ ఇలాంటి అవినీతి, అక్రమాలను తుది దశలోనే గుర్తించి నిలువరించాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. దీంతో ప్రతీ ఏడాది ఏదో ఒక చోట వాయిదా డబ్బులను కాజేసిన వ్యవహారం బయటకు వస్తోంది. పోనీ మెక్కిన సొమ్మును బయటకు కక్కుతున్నారా అంటే అదీ లేదు. మొండికేస్తున్న సిబ్బంది నుంచి డబ్బులను రికవరీ చేయడంలో అధికారులు సైతం విఫలం అవుతున్నారు.

చర్యలు తీసుకున్నాం

బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల వాయిదా చెల్లింపులో చేతివాటం ప్రదర్శించిన ఐకేపీ సిబ్బందిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. రికవరీ విషయంలో మరింత దృష్టి పెడుతాం. వీలైనంత త్వరగా డబ్బులను రాబడుతాం.
- సాయాగౌడ్, డీఆర్‌డీవో, నిజామాబాద్

మచ్చుకు కొన్ని..

■ బోధన్ మండలం కల్దుర్కిలో ఓ మహిళా సంఘం సభ్యులు మూడేళ్ల క్రితం రుణం తీసుకున్నారు. రుణాన్ని సభ్యులందరూ పంచుకున్నారు. తిరిగి చెల్లించడానికి బ్యాంకులో నెలవారి వాయిదాను పెట్టుకున్నారు. ప్రతి నెలా రుణం కట్టే సమయంలో డబ్బులను సీసీ, వీవోఏలకు ఇస్తూ వచ్చారు. వాస్తవానికి ఈ డబ్బులను బ్యాంకులో కట్టాల్సి ఉంటుంది. అలా కాకుండా సీసీ, వీవోఏ తమ సొంతానికి వాడుతున్న విషయం బయటపడింది. మొత్తం రూ.17లక్షల వరకు సొమ్మును కాజేసినట్లు తేలింది. ఇందుకు అధికారులు సీసీని సస్పెండ్ చేయగా, వీవోఏను విధుల నుంచి తొలగించారు. వీరిద్దరి నుంచి డబ్బులను రికవరీ చేయడం సాధ్యం కావడం లేదు. సీసీ వేతనంలో నుంచి నెలకు రూ.6వేలు కోత విధిస్తున్న అధికారులు ఇప్పటి వరకు రూ.90వేల వరకు మాత్రమే రాబట్టారు. దీనికి సంబంధించిన కేసు మండల సమాఖ్యా ద్వారా కోర్టులో నడుస్తోంది. వాయిదా డబ్బులు బ్యాంకులకు ముట్టకపోవడంతో కట్టాల్సిందేనని బ్యాంకు అధికారులు మహిళా సంఘాలను ఒత్తిడి తెస్తున్నారు.

■ బోధన్ మండలం అమ్దాపూర్‌లో రూ.3.13 లక్షలు, కల్దుర్కిలో రూ.2.30లక్షలు స్త్రీనిధి రుణాల్లో ఐకేపీ సిబ్బంది సొంతానికి వాడుకున్నారు. మహిళా సంఘ సభ్యులు తీసుకున్న స్త్రీనిధి రుణాల కిస్తీ డబ్బులను ప్రతినెలా ఐకేపీ సిబ్బందికి ఇచ్చారు. వారు కట్టకపోవడంతో ఇటీవల ఈ వ్యవహారం బయటపడింది. దీంతో అధికారులు విచారణ చేపట్టారు. అమ్దాపూర్‌లో రూ.87వేలు రికవరీ చేయగా, కల్దుర్కి ఘటనలో ఒక్కరూపాయి కూడా రికవరీ చేయలేదు.

బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం

- మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.4.60 కోట్ల చెల్లింపులు
- పెండింగ్‌లో రూ.4.50 కోట్ల బిల్లులు

మోర్తాడ్(బాల్కొండ): బకాయిల చెల్లింపుల ఆలస్యంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. అధికారంలో వస్తే మధ్యాహ్న భోజన ఏజెన్సీల కార్మికుల బకాయిలు పూర్తిగా చెల్లించడంతో పాటు గౌరవ వేతనం పెంచుతామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొంది. అయితే గతేడాదికి సంబంధించిన బిల్లులు పూర్తిగా చెల్లించకపోవడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని 1,234 పాఠశాలల్లోని ఏజెన్సీలకు వేతన బకాయిలతో పాటు, కోడిగుడ్ల బిల్లులు, 9,10వ తరగతి విద్యార్థులకు భోజనం పెట్టిన బిల్లులు రూ.9,11,14,754 రావాల్సి ఉండగా ప్రభుత్వం ఇటీవల రూ.4,60,45,498 మాత్రమే విడుదల చేసింది. ఇంకా రూ.4,50,69,256 విడుదల చేయాల్సి ఉంది.

గౌరవ వేతనంలో కోత

ఏజెన్సీ కార్మికులకు ప్రతి నెలా రూ.3వేల చొప్పున గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. అయితే రూ.వెయ్యి మాత్రమే చెల్లించారు. అలాగే 9,10వ తరగతి విద్యార్థులకు వండిపెట్టిన భోజనానికి సంబంధించిన బిల్లు ఎందుకు చెల్లించలేదో స్పష్టత లేదు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల కార్మికులు అంతా పేద కుటుంబాలకు చెందినవారే ఉన్నారు. అప్పులు తెచ్చి విద్యార్థులకు కడుపునిండా భోజనం పెడుతున్నారు. విద్యార్థుల ఆకలి తీర్చే తాము మాత్రం పస్తులు ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందని కార్మికులు వాపోతున్నారు. బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు.

చెల్లించిన బకాయిలు	
1 నుంచి 8వ తరగతి వరకు భోజనం బిల్లులు	రూ.3,81,59,498
గౌరవ వేతనం రూ.వెయ్యి చొప్పున	రూ.78,86,000
మొత్తం	రూ.4,60,45,498

చెల్లించాల్సినవి	
9, 10వ తరగతుల బిల్లులు	రూ.1,51,49,224
కోడిగుడ్ల బిల్లులు	రూ.1,38,92,032
గౌరవ వేతనం రూ.2వేల చొప్పున	రూ.1,60,28,000
మొత్తం	రూ.4,50,69,256



దీఈవోకు వినతి పత్రం అందిస్తున్న మధ్యాహ్నభోజన కార్మిక సంఘ నాయకులు(ఫైల్)

పూర్తిగా చెల్లించాలి

మధ్యాహ్న భోజన కార్మికుల విషయంలో ప్రభుత్వం కనికరించాలి. ఎంతో మంది కార్మికులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బకాయిలు పూర్తిగా చెల్లించి బిల్లులు ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తే బాగుంటుంది. - చక్రపాణి, మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల సంఘం నాయకుడు

నేటి నుంచి ఎప్‌సెట్ కౌన్సెలింగ్

నిజామాబాద్ అర్బన్: ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించి ఎప్‌సెట్ మొదటి విడత కౌన్సెలింగ్ గురువారం నుంచి ప్రారంభమవుతుందని కౌన్సెలింగ్ సమన్వయకర్త శ్రీరామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులు ధ్రువపత్రాలతో ఈ నెల 6 నుంచి 13వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలన్నారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన విద్యార్థులు ఈనెల 8 నుంచి 15 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

క్లుప్తంగా

నేడు విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాల పిలుపు

నిజామాబాద్‌అర్బన్‌: నీట్‌ పేపర్‌ లీకేజీ వ్యవహారంలో నిందితులను అరెస్ట్‌ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేస్తూ విద్యార్థి సంఘాలు గురువారం పాఠశాలలు, కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చాయి. విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి



పెద్దకొడప్‌గల్‌(జుక్కల్‌): ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని హైవే సిబ్బందికి సీఐ నరేశ్‌ సూచించారు. మండలంలోని జాతీయరహదారి 161పై ఇటీవల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండడంతో బేగంపూర్‌ చౌరస్తా, జుక్కల్‌ చౌరస్తా, జగనాథ్‌పల్లి ప్రాంతాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఎస్సై కోనారెడ్డితో మాట్లాడి ప్రమాదాలు జరగడానికి గల కారణాలను తెలుసుకున్నారు. ప్రమాదాలను అరికట్టేందుకు జాతీయ రహదారి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి చౌరస్తాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయనవెంట ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్‌, ఇన్సిడెంట్‌ మేనేజర్‌ సౌరభ్‌ప్రతాప్‌, స్థానికులు ఉన్నారు.

ఫీజు చెల్లింపునకు ఈనెల 12 తుది గడువు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ రెగ్యులర్‌ నాల్గో సెమిస్టర్‌ 2020–21 విద్యాసంవత్సరం 1, 2, 3, 4వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షల ఫీజు చెల్లింపు తుదిగడువు తేదీ ఈ నెల 12 అని కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ ఎం.అరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో జూలై 13 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ www.telanganauniversity.ac.in ను సంప్రదించాలని ఆమె సూచించారు.

సెమిస్టర్‌ పరీక్షలు వాయిదా వేయాలి

భిక్కనూర్‌: తెలంగాణ యూనివర్సిటీలో ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న నాలుగో సెమిస్టర్‌ పరీక్షలను వాయిదా వేయాలని సౌత్‌ క్యాంపస్‌ విద్యార్థులు కోరారు. ఈ మేరకు బుధవారం సౌత్‌ క్యాంపస్‌ ప్రిన్సిపాల్కు వినతి పత్రం అందజేశారు అనంతరం మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి వచ్చే నెల 5 వరకు డీఎస్సీ టీఆర్టీ ప్రవేశ పరీక్ష షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని గుర్తు చేశారు. కాంపిటేటివ్‌ ఎగ్జామ్స్‌ ఉన్నందున సెమిస్టర్‌ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సౌత్‌ క్యాంపస్‌ అధికారులు తెలిపారు.

మండలాలకు ప్రత్యేకాధికారులు

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్‌
- బాధ్యతలు తీసుకోవాలని ఆదేశాలు

నిజామాబాద్‌ రూరల్‌: ఎంపీపీలు, జెడ్పీటీసీల పదవీకాలం ముగియడంతో మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్‌ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన మండలాల్లో గురువారం బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా జెడ్పీ ఇన్‌చార్జి స్థానంలో ప్రత్యేకాధికారి నియామకంపై అధికారిక ప్రకటన రాలేదు. అయితు, స్పష్టమైన ఆదేశాలు గురువారం వెలువడే అవకాశాలున్నాయని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

ప్రత్యేక అధికారులు వీరే..

మండలం	అధికారి	హోదా	ఫోన్‌నంబర్‌
ఆర్మూర్‌	శ్రీనివాస్‌	డీసీవో	91001 15747
బాల్కొండ	ఎస్‌కే రసూల్‌బీ	డీడబ్ల్యూవో	80087 71786
భీమ్‌గల్‌	విష్ణువర్ధన్‌రెడ్డి	ఆర్‌ఎం సీడ్స్‌	9849908755
బోధన్‌	తరుణ్‌కుమార్‌	డీపీవో	98499 00112
చందూర్‌	విజయ్‌కుమార్‌	ఏడీ మైన్స్‌	96760 86008
ధర్పల్లి	ఎం శ్రీనివాస్‌	డీఎల్‌పీవో	99519 85662
డిచ్‌పల్లి	పి యోహాన్‌	డీసీ(లేబర్‌)	94925 55344
ఇందల్‌వాయి	రంజిత్‌రెడ్డి	డీఎం, మార్క్‌ఫెడ్‌	72888 94625
జక్రాన్‌పల్లి	తిరుమలప్రసాద్‌	డీడీ,ఎఫ్‌టీసీ	72888 94625
కమ్మర్‌పల్లి	సాయాగౌడ్‌	డీఆర్డీవో	92814 86366
కోటగిరి	వి సాయిబాబా	డీఎల్‌పీవో	93936 36320
మాక్లూర్‌	ముత్తెన్న	డీవైఎస్‌వో	97011 77144
మెండోరా	రాజానర్సయ్య	ఏడీ(ఫిషర్స్‌)	91824 67008
మోర్తాడ్‌	ఎంజి మధుసూదన్‌	డీహెచ్‌ఎస్‌వో	89777 13968
మోస్రా	డి రమేశ్‌	ఈడీ, ఎస్సీకార్పొరేషన్‌	98494 93958
మోపాల్‌	సురేశ్‌కుమార్‌	జీఎం, డీఐసీ	96409 09831
ముప్కాల్‌	శ్రీనివాస్‌	ఏడీ ఎస్‌అండ్‌ఎల్‌ఆర్‌	98664 07692
నందిపేట	జగనాథచారి	డీవీఏహెచ్‌వో	99899 97573
నవీపేట	మల్లికార్జున్‌	సీపీవో, నిజామాబాద్‌	77804 76081
నిజామాబాద్‌	రాజేందర్‌	పీడీ, ఎంఈపీఎంఏ	81791 75963
రెంజల్‌	వాజిద్‌హుస్సేన్‌	జిల్లా వ్యవసాయాధికారి	72888 94567
రుద్రూర్‌	శశికళ	డీఎస్‌సీడీవో	99638 60770
సిరికొండ	నాగోరాం	డీటీడీవో, నిజామాబాద్‌	80968 65452
వేల్పూర్‌	కృష్ణవేణి	డీఎండబ్ల్యూవో	94931 15986
వర్ని	రవీందర్‌	ఏపీడీ, డీఆర్డీవో	98663 13079
ఎడపల్లి	నందకుమారి	డీడీ డెయిరీ	91211 60536
ఏర్గట్ల	శివకృష్ణ	డీఎల్‌పీవో, ఆర్మూర్‌	94930 00787

'డైట్‌' అక్రమాలపై విచారణ

- ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ కమిషనర్‌
- వేధిస్తున్నాడని ప్రిన్సిపాల్‌పై.. అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని అధ్యాపకుడిపై ఫిర్యాదులు
- రూ.37 లక్షల దుర్వినియోగం చేశారని ఆరోపణలు
- విచారణ చేపట్టనున్న వరంగల్‌ ఆర్‌జేడీ



నాగారంలోని డైట్‌ కళాశాల

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని డైట్‌ కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు ఓ అధ్యాపకుడి వ్యవహారం, రూ.37 లక్షల దుర్వినియోగంపై ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వరంగల్‌ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి విచారణ చేపట్టనున్నారు. డైట్‌ కళాశాలలో గత కొన్నేళ్లుగా అనేక అక్రమాలు జరుగుతున్నట్లు పాఠశాల విద్యాశాఖకు ఫిర్యాదులు వెళ్లాయి.

కళాశాల ప్రిన్సిపాల్‌ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, కొందరు అధికారులు ఓ వర్గానికి వత్తాసు పలుకుతూ మరో వర్గానికి చెందిన విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులు అందాయి. అలాగే అటెన్‌డెన్స్‌ విషయంలో విద్యార్థులను అనేక ఇబ్బందులకు గురి చేయడంతోపాటు కళాశాలకు రాకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం లేకున్నప్పటికీ అటెన్‌డెన్స్‌ను సాకుగా చూపి ఇబ్బందులకు గురి చేస్తున్నారని కొందరు విద్యార్థులు గతంలో సైతం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విద్యార్థులు చెల్లించే పరీక్ష ఫీజును కళాశాల అకౌంట్‌లో జమ చేయాల్సి ఉండగా, ఓ అధికారి వ్యక్తిగతంగా తన ఖాతాలో జమ చేసుకున్నాడని, అలాగే కళాశాల నిధులు రూ.37లక్షలు లెక్కలేకుండా పోయాయనే ఆరోపణలున్నాయి. గత కొన్నేళ్లుగా ఒకే దగ్గర పని చేస్తున్న అధికారులు ఈ అక్రమాలకు తెరలేపినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేవలం ఒకటి రెండు రోజుల తేడాలో అటెన్‌డెన్స్‌ తక్కువగా ఉందంటూ అడ్మిషన్లు రద్దు చేయడంతో పలువురు విద్యార్థులు సీటు వచ్చినా రోడ్డునపడ్డారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల విద్యార్థులు గతంలో కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, అధికారులు నామమాత్రంగా విచారణ చేపట్టి చేతులు దులుపుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. తాజాగా డైట్‌ కళాశాల వ్యవహారంపై వరంగల్‌ ఆర్‌జేడీ విచారణ చేపట్టనున్నారు.

బాధిత కుటుంబాలకు బీమా చెక్కుల పంపిణీ



సదాశివనగర్‌లో చెక్కులను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు పద్మాజీవాడి చౌరస్తాలో పలువురికి బీమా చెక్కులను బుధవారం మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ పంపిణీ చేశారు. సదాశివనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్‌ కార్యకర్త ఏనుగు జనార్దన్‌ రెడ్డి, సతీమణి ప్రతిభలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌ సభ్యత్వం కలిగి ఉండడంతో బీమా రూ.2 లక్షల చొప్పున బీమా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కమిలి నర్సింలు, బీఆర్‌ఎస్‌ మండలాధ్యక్షుడు మహేందర్‌ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బద్దం శ్రీనివాస్‌ రెడ్డి, కొత్తోళ్ల గంగారాం, విండో చైర్మన్‌లు కమలాకర్‌ రావు, ప్రభాకర్‌ రావు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ ఏడాది విద్యా సంవత్సరానికి 5 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారిణి అలివేలు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి ఈ నెల 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే 5 నుండి 9వ తరగతి వరకు గురుకులాల్లో చదివే విద్యార్థులు సీట్ల బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏఎన్‌ఎం ఉద్యోగానికి..

కామారెడ్డి అర్బన్‌: కామారెడ్డి గిరిజన కళాశాల బాలుర వసతి గృహంలో పొరుగు సేవల కింద ఏఎన్‌ఎంగా నెలకు రూ.22,750 గౌరవ వేతనంతో పని చేయడానికి అర్హులైన గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమాధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

క్రైం కార్నర్‌

పాముకాటుతో మహిళ మృతి



కమల మృతదేహం

ఎల్లారెడ్డిరూరల్‌(ఎల్లారెడ్డి): మున్సిపాలిటీ పరిధిలో ని బాలాజీనగర్‌ తండాకు చెందిన రుడావత్‌ కమల(40) పాముకాటుతో మృతి చెందిందని ఎస్సై మహేశ్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కమల మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కాలికి పాము కాటేసింది. కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కామారెడ్డికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రైమరీ స్కూల్‌లో ట్యాబ్‌ చోరీ

మోపాల్‌: మండలంలోని కంజర్‌ ప్రాథమిక పాఠశాలలో శనివారం రాత్రి ట్యాబ్‌తోపాటు రూ.800 చోరీ అయ్యాయి. పోలీసులు, హెచ్‌ఎం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. విద్యార్థుల హాజరు, మధ్యాహ్నభోజనం వివరాలను రోజువారీగా యాప్‌లో అప్‌లోడ్‌ చేసేందుకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ను రోజులాగే శనివారం సాయంత్రం ఆఫీస్‌ గదిలోని బీరువాలో పెట్టి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం గది తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించిన హెచ్‌ఎం పోలీసులకు ఫిర్యాదుచేశారు. ట్యాబ్‌తోపాటు బెల్టులు, టైలు విక్రయించగా వచ్చిన రూ.800 నగదును సైతం దుండగులు ఎత్తుకెళ్లారు. ట్యాబ్‌ విలువ సుమారు రూ.30వేల వరకు ఉంటుందని తెలిసింది. హెచ్‌ఎం రాజమల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు బుధవారం తెలిపారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్‌ల అప్పగింత



బాధితుడికి ఫోన్‌ అందజేస్తున్న ఏఎస్సై సీతారామమ్మ

బాన్సువాడ : బీర్కూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోరీకి గురైన సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఏఎస్సై సీతారామమ్మ బుధవారం అందజేశారు. బీర్కూర్‌, బైరాపూర్‌, నస్రుల్లాబాద్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు ఇటీవల తమ సెల్‌ఫోన్‌లు పోయాయని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్‌ పోర్టల్‌ ద్వారా సెల్‌ఫోన్లను గుర్తించిన పోలీసులు వాటిని రికవరీ చేసి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

పిచ్చికుక్కల దాడి

- ఐదుగురికి గాయాలు
- భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లిలో ఘటన

భిక్కనూరు: మండలంలోని రామేశ్వరపల్లిలో పిచ్చి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. బుధవారం ఐదు గురిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వద్ద ఓ వ్యక్తిని కరిచిన కుక్కలు రామేశ్వర్‌పల్లి వైపు వచ్చాయి. వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్న మహిళపై దాడి చేసి ఆ తరువాత గ్రామంలోకి ప్రవేశించిన కుక్కల గుంపు గొల్లపల్లి వినోద్గౌడ్‌, సందుగారి లలిత, పైతరి సుశీల, గొల్లపల్లి నాగరాజుగౌడ్‌, నాగర్తి రాధవ్వపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. బాధితులను గ్రామస్తులు కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో కుక్కల బెడదను నివారించాలని వారు కోరుతున్నారు.

ఆరు కిలోల గంజాయి పట్టివేత



నిజామాబాద్‌నాగారం: నగరంలోని బైపాస్‌ రోడ్డులో బుధవారం ఆరు కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారిణి స్వప్న తెలిపారు. దుబ్బ ప్రాంతంలోని ఓ సత్సంగ్‌ సెంటర్‌ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గంజాయి విక్రయిస్తున్నారే సమాచారం మేరకు దాడి చేశామని, ఇర్ఫాన్‌ఖాన్‌, మహమ్మద్‌ యూసుఫ్‌ వద్ద 6 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. నిందితుల నుంచి రెండు వాహనాలతోపాటు మూడు ఫోన్లు, రూ.10,090 నగదు సీజ్‌ చేసినట్లు తెలిపారు. అనంతరం దాడిలో సిబ్బంది నర్సింహచారి, హమీద్‌, భోజన్న, శివకుమార్‌, మంజుల, ఆశన్న, లక్ష్మణ్‌, గంగారాం, రాజన్న పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



ఖలీల్‌వాడి/డిచ్‌పల్లి: ఆర్థిక ఇబ్బందుల కారణంగా నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌ పరిధిలోని మాధవనగర్‌ వద్ద రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయిరెడ్డి బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. వర్ని మండలం జలాల్‌పూర్‌ గ్రామానికి చెందిన సాయికుమార్‌(28) కూలీ పనులు చేస్తూ జీవించేవాడు. బుధవారం ఉదయం 8 గంటలకు మాధవ నగర్‌ రైల్వేగేట్‌ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు చేసిందని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోక్సో కేసు నమోదు

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రేమ పేరుతో బాలికను మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాస్‌ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌ స్టేషన్‌లో బుధవారం ఆయన కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌ మండలం ఉప్పుగూడకు చెందిన కాలే భాస్కర్‌ ఇన్‌స్టాగామ్‌లో పరిచయమయ్యాడు. బ్లూ డార్ట్‌ కంపెనీ(శంషాబాద్‌ ఎయిర్‌పోర్టు)లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న భాస్కర్‌ పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో సదరు బాలిక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. ఇద్దరూ కలిసి గండిమైసమ్మ ప్రాంతంలో రూము అద్దెకు తీసుకొని ఉంటున్నారు. ఇదిలా ఉండగా, బాలిక తండ్రి తన కూతురు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సెల్‌ఫోన్‌ సిగ్నల్‌ ఆధారంగా బాలిక ఉంటున్న ప్రదేశాన్ని గుర్తించారు. భాస్కర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ అనంతరం పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో ఎస్సై చైన్యకుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారులకు అవగాహన అవసరం

- గెజిటెడ్‌ ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ తాన్యానాయక్‌



మాట్లాడుతున్న ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ తాన్యానాయక్‌

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌ : ప్రస్తుత పరిస్థితుల్లో వినియోగదారులు ప్రతి అంశంపై కచ్చితమైన అవగాహన కలిగి ఉండాలని గెజిటెడ్‌ ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌ తాన్యానాయక్‌ అన్నారు. ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఆహార కల్తీపై చైతన్య సదస్సులు నిర్వహించారు. వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అధ్యక్షతన కిషన్‌గంజ్‌ ఏరియాలో సదస్సు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు ఆహార కల్తీపై వివరించారు. ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు కేటాయించిన మొబైల్‌ టెస్టింగ్‌ ల్యాబ్‌లో ఆహార కల్తీ పరీక్షలు నిర్వహించారు. తాన్యానాయక్‌ మాట్లాడుతూ.. కందిపప్పు, కారంపొడుల్లో సింథటిక్‌ కలర్స్‌, మెటనిల్‌ ఎల్లో, సూడాన్‌ కలుపుతున్నారన్నారు. వంటనూనె ప్యాకెట్లపై కుకింగ్‌ ఆయిల్‌ అని ముద్రించి, పొద్దుతిరుగుడు, వేరుశనగ బొమ్మలు వేస్తుండడంపై వినియోగదారులు జాగ్రత్త వహించాలని సూచించారు.

చైతన్యం తీసుకురావాలి

వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. లాభార్జనే ధ్యేయంగా జరుగుతున్న వ్యాపారంలో ఆహార కల్తీ సర్వసాధారణమైందన్నారు. వినియోగదారుల్లో నిరంతరం చైతన్యం తీసుకురావడమే శ్రీరామరక్ష అన్నారు. పాలల్లో హానికరమైన హైడ్రోజన్‌ పెరాక్సైడ్‌, అమ్మోనియం సల్ఫేట్‌ వాడుతున్నారని, దీనిపై అధికారులు పరిశీలన చేయాలని కోరారు. ఈ నెల 3 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆహార కల్తీపై చైతన్య కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. జిల్లా మహిళా సంక్షేమ అధికారి ఎస్‌ రసూల్‌బీ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వమే సరుకులు సరఫరా చేస్తోందన్నారు. నాణ్యతపరంగా ఎలాంటి సమస్యలు లేవన్నారు. బియ్యం మాత్రమే కొన్ని ప్రాంతాల్లో నాసిరకంగా ఉన్నాయన్నారు. విజయ డెయిరీ మార్కెటింగ్‌ ఆఫీసర్‌ సుమిత్ర.. విజయ డెయిరీ పాల నాణ్యతను వివరించారు. ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి అధ్యక్ష, కార్యదర్శులు పెండోట అనిల్‌కుమార్‌, సందు ప్రవీణ్‌, ఉపాధ్యక్షుడు వివిఎస్‌ వర్మ, సంయుక్త కార్యదర్శులు మహాదేవుని శ్రీనివాస్‌, గైని రత్నాకర్‌, గడప రవికుమార్‌, బానోత్‌ సందీప్‌, దేవేశ్‌ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాంబరాజు చక్రపాణి

మంత్రులను కలిసిన ఎంప్లాయీస్‌ జేఏసీ



సీతక్కకు బొకే అందజేస్తున్న జేఏసీ నాయకులు

సుభాష్‌నగర్‌: ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్‌, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కను తెలంగాణ ఎంప్లాయీస్‌ జేఏసీ రాష్ట్ర చైర్మన్‌, టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం హైదరాబాద్‌లో వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రులను మర్యాదపూర్వకంగా సన్మానించారు. పెండింగ్‌ సమస్యలు, రావాల్సిన కరువు భత్యం, ఎక్సైజ్‌శాఖ ఉద్యోగులు, సాంస్కృతి కళాకారుల సమస్యలపై మంత్రి జూపల్లితో చర్చించారు. అనంతరం సీతక్కను కలిసి ఉద్యోగుల సమస్యలతోపాటు అంగన్‌వాడీ టీచర్ల సమస్యల్లో భాగంగా పదోన్నతులు, టీచర్ల వయస్సు సడలింపు, ఇతరత్ర సమస్యలపై వినతిపత్రం అందజేశారు. త్వరలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు సీఎం సుముఖంగా ఉన్నారని, తీపి కబురు ఉంటుందని మంత్రులు సానుకూలంగా స్పందించారు. జేఏసీ రాష్ట్ర సెక్రెటరీ జనరల్‌ ఏలూరి శ్రీనివాస్‌, కేంద్ర సంఘం ప్రధానకార్యదర్శి ముజీబ్‌, జిల్లా చైర్మన్‌, టీఎన్జీవో అధ్యక్షుడు అలుక కిషన్‌, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్‌, సహాధ్యక్షుడు చిట్టి నారాయణరెడ్డి, కేంద్ర బాధ్యులు పోల శ్రీనివాస్‌, జాఫర్‌ హుస్సేన్‌ తదితరులు పాల్గొన్నారు.

భర్త ఇంటి ఎదుట ధర్నా



భర్త ఇంటి ఎదుట కుమారులతో కలిసి బైఠాయించిన అశ్విని

ఆర్మూర్‌టౌన్‌: తనకు న్యాయం చేయాలని కోరుతూ ఆర్మూర్‌ పట్టణానికి చెందిన సాత్‌పుతే గిర్మాజీ అశ్విని తన ఇద్దరు పిల్లలతో కలిసి భర్త ఇంటి ఎదుట బుధవారం బైఠాయించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన అర్వింద్‌తో 11 సంవత్సరాల క్రితం వివాహమైందని, ఇద్దరు కుమారులు ఉన్నా రని తెలిపింది. తన భర్త అర్వింద్‌ వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని గత మూడు సంవత్సరాలుగా తమను దూరం పెట్టాడని ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్త ఆచూకీ చెప్పకుండా అత్తింటివారు గోప్యంగా ఉంచుతున్నారని, తమకు న్యాయం చేయా లని వేడుకున్నది. తనను ఇంట్లోకి రాకుండా అడ్డుకుంటున్న అత్తపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేసింది.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ



రుద్రూర్‌లో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వాజీద్‌ హుస్సేన్‌

రుద్రూర్‌: కోటగిరి, పొతంగల్‌, రుద్రూర్‌ మండలాల్లోని సహకార సంఘాల్లో బుధవారం రైతు భరోసా పథకంపై ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. రుద్రూర్‌ మండల కేంద్రంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా వ్యవసాయాధికారి వాజీద్‌ హుస్సేన్‌ హాజరై రైతుల అభిప్రాయాలు సేకరించారు. మెజారిటీ రైతులు సాగుభూమికి మాత్రమే రైతు భరోసా కల్పించాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కాగా ఐదు ఎకరాల్లోపు వారికి ఇవ్వాలని కొందరు, రెండు ఎకరాలకు పరిమితం చేయాలని మరి కొందరు, ఇన్‌కమ్‌ ట్యాక్స్‌కు సంబంధం లేకుండా రైతుభరోసా ఇవ్వాలని ఇంకొందరు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి నగేశ్‌రెడ్డి, జెడ్పీటీసీ సరోజి గంగారాం, విండో చైర్మన్‌ బి సంజీవరెడ్డి, సీఈవో లక్ష్మణ్‌, విండో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఉమ్మడి కోటగిరి మండలంలో..

ఉమ్మడి కోటగిరి మండలంలోని పొతంగల్‌, కొత్తపల్లి, ఎత్తొండ, కోటగిరి సహకార సంఘాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌ రావు, ప్రత్యేకాధికారులు, విండో చైర్మన్లు, ఏఈవోలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

నిజామాబాద్‌నాగారం: అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రిటైర్‌ అయ్యే ఉద్యోగులకు వారసత్వ హక్కు కల్పించాలని అంగన్‌వాడీ టీచర్స్‌, హెల్పర్స్‌ యూనియన్‌(సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేశ్‌బాబు డిమాండ్‌ చేశారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో బుధవారం ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్‌ అంకిత్‌, ఐసీడీఎస్‌ పీడీ రసూబీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన 1334ను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులు గత సెప్టెంబర్‌లో నిర్వహించిన 24 రోజుల సమ్మె సందర్భంగా అప్పటి ప్రభుత్వం, మంత్రులు అధికారుల సమక్షంలో ఇచ్చిన హామీ మేరకు 65 సంవత్సరాలు నిండిన టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష రిటైర్మెంట్‌ బెనిఫిట్స్‌ ఇవ్వాలన్నారు. సమ్మె కాలపు వేతనాలను చెల్లించాలని, కాంగ్రెస్‌ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వేతనాలను పెంచి ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు కే దేవగంగు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జై.శంకర్‌గౌడ్‌ అంగన్‌వాడీ అసోసియేషన్‌ జిల్లా కోశాధికారి పి.చంద్రకళ, ఉపాధ్యక్షులు సూర్యకళ, శివరాజమ్మ, కరుణ, నాయకులు ఎలిజబెత్‌ రాణి, విజయ, జ్యోతి, సందీప, సరిత, గోదావరి, లక్ష్మి, అరుణ, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.